క్లుప్తంగా

ఆర్టీసీ ఉద్యోగుల అపరిష్కృత సమస్యలపై వినతి



గన్నవరం: ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఏపీపీటీడీ ఎన్ఎంయూఏ జిల్లా అధ్యక్షుడు బి.నాగిరెడ్డి డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ కేవీ శివయ్యను సంఘ నేతలు కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం నాగిరెడ్డి మాట్లాడుతూ.. ఆర్టీసీలో అపరిష్కృత సమస్యలపై ఇప్పటికే దశల వారిగా ఎన్ఎంయూఏ ఉద్యమం చేస్తోందన్నారు. అయినప్పటికి ఆర్టీసీ యాజమాన్యం, ప్రభుత్వం నుంచి ఎటువంటి సానుకూల స్పందన కనిపించకపోవడం శోచనీయమన్నారు. అందుకే ఆర్టీసీ యాజమాన్యంపై ఒత్తిడి పెంచేందుకు పోరాటాన్ని మరింత తీవ్రతరం చేయనున్నట్లు తెలిపారు. అసోసియేషన్ జిల్లా నాయకులు పి.ఉషారాణి, టి.బాలరాజు, బీజే కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



పెనమలూరు: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని రంజీ ట్రోఫీ మాజీ క్రికెటర్ జీఎస్ శ్రీనివాసరావు అన్నారు. కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో సోమవారం స్పోర్ట్స్ డే సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్రీడలు శారీరకంగా, మానసికంగా అభివృద్ధికి తోడ్పడతాయన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు సైతం క్రీడల ద్వారా పెరుగుతాయని చెప్పారు. ఏఎన్‌టీయూకే ఇంటర్‌కాలేజ్ టోర్నమెంట్, సౌత్ ఇండియా, ఆల్ ఇండియా టోర్నమెంట్స్‌లో, కల్చరల్ విభాగంలో పతకాలు సాధించిన విజేతలకు మాజీ క్రికెటర్ శ్రీనివాసరావు పతకాలు బహూకరించారు. కార్యక్రమంలో కాలేజీ కన్వీనర్ వి.నాగభూషణరావు, ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, కల్చరల్ ఇన్‌చార్జి డాక్టర్ రుద్రమాదేవి, ఫిజికల్ డైరెక్టర్ ఎం.సాంబశివరావు, క్రీడాకారులు పాల్గొన్నారు.

తాడిగడప జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ



పెనమలూరు: పోరంకికి చెందిన శ్రీసత్యసాయి సేవాసమితి ఆధ్వర్యంలో తాడిగడప జంక్షన్‌లో మజ్జిగ పంపిణీ చేశారు. సత్యసాయి సేవాసమితి కన్వీనర్ రంగారావు సోమవారం వివరాలు తెలుపుతూ గత ఏప్రిల్ 24వ తేదీన భగవాన్ శ్రీ సత్యసాయి బాబా ఆరాధన దినోత్సవం సందర్భంగా తాడిగడప జంక్షన్‌లో చలివేంద్రం ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి ప్రయాణికులకు మజ్జిగ పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ప్రతీ రోజు 10 మంది స్త్రీ, పురుషులు స్వచ్ఛందగా పాల్గొని సేవలు అందిస్తున్నారన్నారు. జూన్ నెల 5వ తేదీ వరకు నిరంతరాయంగా మజ్జిగ పంపిణీ కొనసాగుతుందని తెలిపారు.

వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలి



విజయవాడకల్చరల్: గాయనీ గాయకులతో పాటు వారి ఉన్నతికి సహాయ సహకారాలు అందిస్తున్న వాయిద్య కళాకారుల సంక్షేమానికి కృషి చేయాలని విశ్రాంత పోలీస్ అధికారి కే డేవిడ్‌రాజు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికపై సోమవారం రైల్వే అధికారి, కళాపోషకుడు మారేపల్లి జోషి జన్మదిన సందర్భంగా సినీ సంగీత విభావరి, వాయిద్య కళాకారులు ఉంద్రు చిట్టిబాబు, ఇశ్రాయల్‌కు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. డేవిడ్ రాజు మాట్లాడుతూ.. సాహితీ సాంస్కృతిక సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని సూచించారు. సత్కార కార్యక్రమంలో వివిధ సంస్థల ప్రతినిధులు చింతకాయల చిట్టిబాబు, పరుచూరి విజయలక్ష్మి, బీవీ వీరభద్రరావు, జయప్రభ, ప్రసూనా రామన్ పాల్గొన్నారు. గాయనీ గాయకులు పలు తెలుగు చిత్ర గీతాలను ఆలపించారు. వాయిద్య కళాకారులు చిట్టిబాబు, ఇశ్రాయేల్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

గొల్లపూడి ఎత్తిపోతల పథకానికి గ్రహణం

- మరమ్మతులకు నోచుకోని గొల్లపూడి పంపింగ్ స్కీమ్
- ప్రతిపాదనలకే పరిమితం
- దాళ్వాలో ఎత్తిపోతల పథకం నిర్వహణ రైతులే భరించిన దుస్థితి



కాల్వలో దట్టంగా పెరిగిన గుర్రపుడెక్క



పాముల కాల్వ వద్ద విరిగిన సైఫన్



గొల్లపూడిలో పంపింగ్ స్కీమ్

విజయవాడరూరల్: కూటమి ప్రభుత్వంలో గొల్లపూడి ఎత్తిపోతల పథకానికి గ్రహణం పట్టింది. బుడమేరు వరదల్లో మోటార్లు మునిగిపోయి, కాల్వగండ్లు పడటం, స్కీమ్ వద్ద ప్రహరీ పడిపోయి భారీ నష్టం జరిగింది. ఉమ్మడి కృష్ణా జిల్లాలో అతి పెద్ద ఎత్తిపోతల పథకల్లో ఒకటైన గొల్లపూడి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు నోచుకోవడం లేదు. గొల్లపూడి, విద్యాధరపురం, భవానీపురం, జక్కంపూడి, అంబాపురం, పి.నైనవరం, పాతపాడు, కండ్రిక, నున్న, ముస్తాబాద గ్రామాల్లో 7 వేల ఎకరాల ఆయకట్టు వ్యవసాయ భూములున్న గొల్లపూడి ఎత్తిపోతల పథకాన్ని రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన అనంతరం సెప్టెంబర్‌లో సంభవించిన బుడమేరు వరదల కారణంగా కృష్ణానది నుంచి నీటిని ఎత్తిపోసే మోటారు పూర్తిగా వరదల్లో మునిగిపోయాయి. స్కీమ్ వద్ద గోడ పూర్తిగా పడిపోగా ఇంత వరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. కాల్వ కట్టకు సుమారు 12 చోట్ల భారీగండ్లు పడగా వాటిని పూడ్చే పనులను సైతం ప్రభుత్వం చేపట్టలేదు. రైతులు ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులను కలిసి మోటార్లు రిపేర్లు చేయించాలని కాల్వకు పడిన గండ్లు పూడ్చాలని ఒకటికి పది సార్లు తిరిగేతే ప్రభుత్వం నుంచి గ్రాంటు వస్తే తప్ప కాల్వ మరమ్మతులు చేసే పరిస్థితి లేదని తేల్చి చెప్పారు. ప్రతి గ్రామంలో ఆయకట్టు రైతులే స్వయంగా ఎకరానికి వెయ్యి రూపాయల చొప్పున లక్షలాది రూపాయలు వసూలు చేసి మోటర్లు రిపేరు చేయించుకున్నారు. కాల్వకు పడిన గండ్లు పూడ్చుకునే పనులు చేయడం వల్ల దాళ్వా సీజన్‌లో రైతులు పంట పండించుకునే అవకాశం ఏర్పడింది. ఖరీఫ్ సీజన్‌లో కూడా ప్రభుత్వం నుంచి గ్రాంటు రాకపోతే రైతులే నిర్వహించుకోవాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది.

రూ.90 లక్షలతో ప్రతిపాదనలు

గత సెప్టెంబర్‌లో సంభవించిన వరదల కారణంగా జిల్లాలో దెబ్బతిన్న ఎత్తిపోతల పథకాలకు మరమ్మతులు నిర్వహించడానికి స్వయంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అంచనాలు తయారు చేసి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో గొల్లపూడి ఎత్తిపోతల పథకం మరమ్మతులకు 90 లక్షల రూపాయలతో అంచనాలు తయారు చేసి పంపారు. అప్పటి నుంచి కాల్వ మరమ్మతులకు ప్రభుత్వం నుంచి ఏదైనా గ్రాంటు వస్తోందేమోనని అటు అధికారులు, ఇటు రైతాంగం ఎదురు చూస్తున్నారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పథకం మరమ్మతులకు ఒక్క రూపాయి విడుదల చేయలేదు. ముఖ్యంగా 75 హెచ్‌పీ సామర్థ్యంగల మోటార్లు 4, 60 హెచ్‌పీ సామర్థ్యం గల మోటార్లు 2 పూర్తి స్థాయిలో రిపేర్లు చేయాల్సి ఉందని రైతులు చెబుతున్నారు. నదిలో నుంచి నీరు పంపింగ్ స్కీమ్‌లోకి వచ్చే కట్టడాలు కూలిపోయి ఉండటంతో యుద్ధప్రాతిపదికన ఆ పనులు చేయాల్సి వస్తోందంటున్నారు. పాముల కాల్వ వద్ద సైఫన్ విరిగి పడిపోవడంతో కాల్వలోకి వెళ్లాల్సిన నీరు బుడమేరులో కలిసి పంట శివారు ప్రాంతాలకు నీరు చేరడం లేదు. సైఫన్‌కు ఇంత వరకు రిపేర్లు చేయలేదు. గేట్లు తుప్పు పట్టి మూమెంట్ లేకపోవడంతో అలంకార ప్రాయంగా సబ్‌ఛానెల్ గేట్లు కనిపిస్తున్నాయి. కూటమి ప్రభుత్వం రైతులకు అండగా ఉంటుందని పాలకులు చెప్పడమే కానీ పట్టించుకున్న పాపం లేదని వ్యవసాయ సంఘం ప్రతినిధులు విమర్శిస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన వ్యవసాయ పనులు ప్రారంభానికి ముందే మరమ్మతులు చేయాలని రాష్ట్ర ప్రభుత్వానికి రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

కాల్వ గండ్లు పూడ్చాలి..



ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే గొల్లపూడి ఎత్తిపోతల పథకం వద్ద రిపేర్లు చేయాలి. కాల్వకు పడిన గండ్లు పూడ్చాలి. నీరు శివారు భూములకు అందేలా చర్యలు తీసుకోవాలి.

– ఎస్.దయాకర్, గ్రామస్తుడు, అంబాపురం

మరమ్మతులకు ప్రతిపాదనలు పంపాం..

గొల్లపూడి ఎత్తిపోతల పథకం రిపేర్లకు ప్రతిపాదనలను ప్రభుత్వానికి పంపాం. ప్రభుత్వం నుంచి గ్రాంటు రాగానే రిపేర్ల పనులు ప్రారంభిస్తాం.

– బి.రత్నరాజు, ఈఈ

ముమ్మరంగా డ్రెయిన్ల పూడికతీత

రామవరప్పాడు: గ్రామంలో పారిశుద్ధ్యాన్ని మెరుగు పరిచేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి ఘంటా రామ్మోహనరావు తెలిపారు. రూరల్ మండలం రామవరప్పాడు ప్రధాన గ్రామంతో పాటు జాతీయ రహదారికి ఇరువైపులా మురుగు పారుదలకు నోచుకోని డ్రెయిన్లను గుర్తించి సోమవారం పూడిక తీశామన్నారు. ఈ సందర్భంగా రామ్మోహనరావు మాట్లాడుతూ.. అంతర్గత రహదారులతో పాటు జాతీయ రహదారిపై డ్రెయిన్లు పూడుకుపోవడంతో మురుగునీరు సజావుగా పారడం లేదని పంచాయతీకు ఫిర్యాదులు అందాయన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న డ్రెయిన్లు, అంతర్గత రహదారుల్లోని డ్రెయిన్లను పారిశుద్ధ్య సిబ్బందిచే పూడిక తీయించామన్నారు. చెత్తను కూడా ఎప్పటికప్పుడు తొలగించి డంపింగ్ యార్డ్‌కు తరలిస్తున్నట్లు చెప్పారు.

వీరవల్లిలో పశు వైద్యశిబిరం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో పశుసంవర్ధకశాఖ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత పశు వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరాన్ని పశుసంవర్ధక శాఖ బాపులపాడు అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రావణ్‌కుమార్ ప్రారంభించారు. పశుపోషణలో పాటించాల్సిన జాగ్రత్తలు, అధిక పాల దిగుబడికి తీసుకోవాల్సిన పద్ధతులను వివరించారు. పశు సంరక్షణకు ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ఏడీ శ్రావణ్‌కుమార్ తెలియజేశారు. లేగ దూడల అందాల పోటీలు నిర్వహించగా, పాడి రైతు కోడెబోయిన బాబీకి చెందిన ఒంగోలు జాతి ఆవు దూడకు మొదటి బహుమతి లభించింది. సర్పంచ్ పిల్లా అనిత, పశువైద్యాధికారి డాక్టర్ దివ్య సుమన్, డాక్టర్ హరిత, పశుసంవర్ధక శాఖ సిబ్బంది రామకృష్ణ, బాబూరావు, జిలాని, సహదేవుడు, శ్యామల పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి శిక్షణ శిబిరాలు



తెన్నేరు గ్రంథాలయంలో కథలు వింటున్న విద్యార్థులు



వణుకూరులో లెమన్ అండ్ స్పూన్ ఆడుతున్న విద్యార్థులు



కంకిపాడులో చిత్రలేఖనంలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

కంకిపాడు: పెనమలూరు, గన్నవరం నియోజకవర్గాల్లో వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. శిబిరాల్లో భాగంగా తెన్నేరు శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు సోమవారం కోలాటం, క్యారమ్స్, కథలు చెప్పటం, వినటంపై శిక్షణ ఇచ్చారు. పఠనాశక్తి పెంపొందించుకోవాలని వక్తలు సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి ఎస్.సునీత పర్యవేక్షించారు. కంకిపాడు శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరంలో విద్యార్థులకు చిత్రలేఖనంలో ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. విద్యార్థులు తమకు నచ్చిన అనేక అందమైన బొమ్మలను గీసి తమ ప్రతిభను చాటారు. క్యారమ్స్, చెస్‌లో శిక్షణ అందించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి సీహెచ్ రామకృష్ణ పర్యవేక్షించారు.

వణుకూరు గ్రంథాలయంలో క్రీడా పోటీలు

పెనమలూరు: వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా వణుకూరు శాఖ గ్రంథాలయంలో సోమవారం విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు. గ్రంథాలయ అధికారి భారతి వివరాలు తెలుపుతూ విద్యార్థులకు పుస్తక పఠనం, తోక కథలు చెప్పించామన్నారు. అనంతరం విద్యార్థుల్లో మానసిక ఆనందం పొందటానికి లెమన్ అండ్ స్పూన్, ఇతర ఆటల పోటీలు నిర్వహించామని తెలిపారు. వివిధ ఆటల పోటీల్లో 34 మంది విద్యార్థులు పాల్గొన్నారని చెప్పారు.

శాస్త్రజ్ఞుల జీవిత చరిత్రలు స్ఫూర్తిదాయకం

హనుమాన్‌జంక్షన్‌రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలోని గ్రంథాలయంలో చిన్నారుల కోసం ఏర్పాటు చేసిన వేసవి విజ్ఞాన శిబిరం తరగతులు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఈ శిబిరంలో సోమవారం విద్యార్థులకు శాస్త్రజ్ఞుల జీవిత చరిత్ర పుస్తకాలు, వారి పరిశోధనలను గూర్చి పరిచయం చేశారు. భారతీయ ప్రాచీన శాస్త్రవేత్తలు, గణిత, సంఖ్యా, ఖగోళ శాస్త్రాల్లో వారి కనపర్చిన ప్రతిభ, ఆవిష్కరణలను వివరించే పుస్తకాలను విద్యార్థులకు అందించి చదివించారు. భారతీయ గణిత మేధావి శ్రీనివాస రామానుజన్, క్షిపణి బ్రహ్మ ఏపీజే అబ్దుల్ కలాం, నోబెల్ పురస్కార గ్రహీత సి.వి.రామన్‌ల జీవిత విశేషాలను వివరించారు. అంతేకాక తెలుగు పద్యాలు, కవుల గూర్చి విద్యార్థులకు గ్రంథాలయ అధికారి పి.స్వర్ణలతాదేవి వివరించారు. మాతృభాష నేర్చుకోవాల్సిన ఆవశ్యకత తెలియజేశారు. అనంతరం విద్యార్థులతో ఆటలు ఆడించటంతో పాటు నృత్య శిక్షణ తరగతులు నిర్వహించారు.

ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి



పెనమలూరు ఎంపీడీఓ ప్రణవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు



గన్నవరంలో నిరసన తెలుపుతున్న కార్మిక సంఘ నాయకులు

పెనమలూరు: ఉపాధి హామీ కూలీల సమస్యలు ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ మండల కార్యదర్శి ఉప్పాడ త్రిమూర్తి డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం మండల పరిషత్ కార్యాలంలో ఎంపీడీఓ బండి ప్రణవికి నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా త్రిమూర్తి మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు 200 రోజులు పని దినాలు పని కల్పించాలన్నారు. కనీస వేతనం రోజుకు రూ.600 ఇవ్వాలన్నారు. కార్మికులు పని చేస్తున్న ప్రాంతంలో టెంట్‌లు వేసి మంచి నీటి వసతి, ఓఆర్ఎస్ ప్యాకెట్లు ఇవ్వాలని కోరారు. ఉపాధి కూలీలకు ప్రమాద బీమా అమలు చేయాలన్నారు. సీపీఎం మండల కార్యదర్శి షేక్ కాశిం, నాయకులు మరీదు భాస్కరరావు, వేణు, కాట్రగడ్డ నాగమణి, పిల్లి బాబూరావు, యోహాన్, పేతులరు, కొక్కిలిగడ్డ జోజి పాల్గొన్నారు.

గన్నవరంలో నిరసన

గన్నవరం: ఉపాధి హామీ కూలీల సమస్యలను ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కార్యాలయంలో ఏపీఓను కలిసిన సంఘ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం మండల కార్యదర్శి కళ్లం రాంబాబు మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు ఏడాదికి 200 పనిదినాలు కల్పించడంతో పాటు రూ.600 చొప్పున రోజువారీ వేతనం చెల్లించాలని కోరారు. అన్ని సౌకర్యలు కల్పించాలని డిమాండ్ చేశారు. నాయకులు మల్లంపల్లి ఆంజనేయులు, బెజవాడ తాతబ్బాయి, కళ్లం వెంకటేశ్వరరావు, కైలే ఏసుదాసు, అంథోని, మిరప నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ కార్మిక సంఘం ధర్నా

ఉంగుటూరు(గన్నవరం): ఉపాధి హామీ కూలీల సమస్యల పరిష్కారం కోరుతూ సోమవారం మండల కేంద్రమైన ఉంగుటూరు మండల పరిషత్ కార్యాలయం వద్ద వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. అనంతరం ఎంపీడీఓ ఈ.సత్యకుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. జాబ్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబానికి వంద రోజుల పనిదినాలు కల్పించాలని సంఘం మండల కార్యదర్శి అజ్మీర్ వెంకటేశ్వరరావు డిమాండ్ చేశారు. వ్యవసాయ పనులు లేని కార్మికులకు 200 రోజులు చొప్పున పని కల్పించాలని కోరారు. పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని, ఉపాధి కూలీలు పనిచేసే చోట కనీస సదుపాయలు కల్పించాలన్నారు. నాయకులు టీవీ రామ్మోహన్‌రావు, బి.సుబ్బారెడ్డి, పి.దుర్గారావు, ముసలయ్య, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

29న ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్ ఎన్నికలు

ఆటోనగర్(విజయవాడతూర్పు): ఆటోమొబైల్ మెకానిక్స్ అసోసియేషన్‌ను అన్ని విధాలుగా అభివృద్ధి చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు గంధం వెంకటేశ్వరరావు అన్నారు. ఆటోనగర్‌లో సోమవారం ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ పదవీ కాలం ముగియడం వల్ల మరలా ఈ నెల 29న ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మరిన్ని వివరాలకు ఎన్నికల అధికారులు పంచకర్ల వెంకటరమణారావు, తాడేపల్లి శ్రీనివాసదివాకర్‌ను సంప్రదించాలన్నారు.

పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోండి



వేలేరులో అవగాహన కల్పిస్తున్న అధికారులు

హనుమాన్‌జంక్షన్‌రూరల్: కేంద్రం అమలు చేస్తున్న పీఎం సూర్యఘర్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని బాపులపాడు ఎంపీడీవో కె.జోగేశ్వరరావు తెలిపారు. తొలి విడతలో సూర్యఘర్ పథకం అమలుకు జిల్లాలో బాపులపాడు మండలం వేలేరు సహా ఎనిమిది గ్రామాలను ప్రభుత్వం ఎంపిక చేయటంతో ఆ గ్రామంలో పంచాయతీరాజ్, విద్యుత్, రెవెన్యూ, గ్రామ సచివాలయ శాఖల సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీఎం సూర్యఘర్ పథకంలో భాగంగా గృహ విద్యుత్ కనెక్షన్లకు కేంద్ర ప్రభుత్వం 50 శాతం రాయితీపై సోలార్ విద్యుత్ ఉపకరణాలు అందిస్తోందని ఎంపీడీవో చెప్పారు. సౌర విద్యుత్ వినియోగంతో విద్యుత్ బిల్లుల భారం తగ్గుతుందన్నారు. ఆసక్తి గల గృహ విద్యుత్ వినియోగదారులు పీఎం సూర్యఘర్ పథకం నమోదుకు ఈ నెల 10వ తేదిన గ్రామంలో ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేస్తున్నామన్నారు. 1 కేవీ సౌర విద్యుత్ కనెక్షన్ పొందేందుకు రూ.30 వేలు, 2 కేవీ కనెక్షన్‌కు రూ.60 వేలు, 3 కేవీ కనెక్షన్‌కు రూ.78 వేలు చొప్పున కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ అందిస్తోందని ఎంపీడీవో తెలిపారు. సీపీడీసీఎల్ వీరవల్లి ఏఈ మురళీకృష్ణారావు, వెలుగు ఏపీఎం శ్రీనివాసరావు, గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గాలులు భీకరం.. నష్టం అపారం



పెదపులిపాకలో పంట పొలంలో నేలవాలిన వరి పంట



గోసాలలో విరిగి పడిన అరటితోటలో రైతు



తాడిగడపలో నేలమట్టమయిన మొక్క జొన్న పంటను చూపుతున్న రైతు

వందల ఎకరాల్లో పంట వర్షార్పణం

పెనమలూరు: ప్రకృతి కన్నెర్ర చేయటంతో రైతులు మరోసారి తీవ్రంగా నష్టపోయారు. పెనమలూరు మండల పరిధిలో ఆదివారం భీకర గాలులు, వర్షం పడటంతో రైతులు చేతికి రావాల్సిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. దాళ్వా వరి పంటపొలాల్లో ఉన్న దాదాపు 100 ఎకరాలు వరి పంట నేలవాలి తడిసిపోయింది. పంట నీటిలో నానుతోంది. అలాగే వరి ధాన్యం మిల్లులకు తరలించటానికి సిద్ధంగా ఉంచగా.. ప్రభుత్వం రైతుల వద్ద సకాలంలో ధాన్యం కొనుగోలు చేయకపోవటంతో 1.60 టన్నుల ధాన్యం వర్షానికి తడిసి ముద్దయింది. దాదాపు 4 వేల ధాన్యం బస్తాలు పంట పొలాల వద్దే ఉండి పోయాయి. తడిసిన ధాన్యం ఏమి చేస్తారనే విషయమై అధికారులు ఇప్పటివరకు రైతులకు స్పష్టమైన హామీ ఇవ్వలేదు. ప్రభుత్వం సకాలంలో తమ వరి ధాన్యం కొనుగోలు చేసి ఉండి ఉంటే సమస్య వచ్చేది కాదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తడిసిన ధాన్యానికి గిట్టుబాటు ధర ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

అరటి తోటలు నేలమట్టం..

ఈదురు గాలుల వల్ల అరటి రైతులు కోలుకోలేని విధంగా దెబ్బతిన్నారు. మండల పరిధిలో దాదాపు 50 ఎకరాల అరటి తోటలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వణుకూరు, గోసాల, గంగూరు, తాడిగడప ప్రాంతాల్లో కాపునకు అరటి తోటలు గాలులతో నేలమట్టమయ్యాయి. అరటి చెట్టు పూర్తిగా విరిగిపోయి పడిపోయాయి. అరటి గెలలు ఎందుకు పనికి రాకుండా పోయాయి. తమకు ప్రభుత్వం న్యాయం చేయాలని లేక పోతే అప్పులు తట్టుకోలేమని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక మొక్కజొన్న, తమలపాకు పంటలు కూడా ఈదురు గాలులకు నేలవాలి దెబ్బతిన్నాయి.

రైతులకు ప్రభుత్వ సాయం ఉందా?

పంటలు నష్ట పోయిన రైతులకు ప్రభుత్వం సాయం అందిస్తుందా లేదా అనే విషయం అధికారులు స్పష్టం చేయటం లేదు. పంట నష్టం వివరాలు ప్రాథమికంగా సేకరించామని అధికారులు చెబుతున్నారు. ప్రభుత్వం నుంచి పంట నష్టం సాయంపై ఎటువంటి ఉత్తర్వులు అందలేదని చెబుతున్నారు. వెంటనే ఎన్యూమరేషన్ చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

ముగిసిన కూచిపూడి రంగ ప్రవేశ ఉత్సవాలు

విజయవాడకల్చరల్: భారతీయ సంస్కృతీ సంప్రదాయాలు ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తాయని డాక్టర్ చింతారవి బాలకృష్ణ పేర్కొన్నారు. ఘంటసాల వెంకటేశ్వరరావు ప్రభుత్వ నృత్య సంగీత కళాశాలలో డాక్టర్ చింతా రవి బాలకృష్ణ ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కూచిపూడి రంగ ప్రవేశ ఉత్సవాలు సోమవారం ముగిశాయి. భువనసాయి లలిత నృత్యరంగ ప్రవేశంలో భాగంగా నాటరాగంలో నర్తన గణపతితో ప్రారంభించి, శివస్తుతి చిదంబరీ, స్తవం, పదము నగుమోము, థిల్లానా అంశాలను ప్రదర్శించింది. నాట్యాచార్యులు హరిరామమూర్తి, సంతోష్, సీహెచ్ శ్రీనివాస్, నండూరి శంకర కోటేశ్వరరావు సంగీత విద్వాంసుడు పోపూరి గౌరీనాథ్‌ను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు. డాక్టర్ చింతారవి బాలకృష్ణ మాట్లాడుతూ కూచిపూడి నృత్య సంప్రదాయంలో రంగప్రవేశం ప్రధానమైనదని తెలిపారు. కార్యక్రమంలో మోతుకూరి, మోతుకూరి రాంబాబు, లక్ష్మీశైలజ పాల్గొన్నారు.

- పాయకాపురం(విజయవాడరూరల్): సర్దుబాటు, ట్రూ అప్ విద్యుత్ చార్జీలను రద్దు చేయాలని సీపీఎం పార్టీ ఎన్టీఆర్ జిల్లా కమిటీ సభ్యుడు కే దుర్గారావు డిమాండ్ చేశారు. స్మార్ట్ మీటర్లు వద్దని, పెంచిన విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో ప్రజాభేరి కార్యక్రమంలో భాగంగా సోమవారం రాజీవ్‌నగర్‌లో సంతకాల సేకరణ జరిగింది. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.